## మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** జిల్లాలోని ఏడు నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న సంక్షేమ హాస్టళు విద్యార్థిని, విద్యార్థులు చదువుకు దూరం అయ్యే విధంగా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహూల్, వీరపోగు రవి అన్నారు. గురువారం కడప నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టల్లో మౌలికవసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జిల్లాలో బద్వేలు, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, ప్రాంతంలో హాస్టల్‌లో విద్యార్థులు సరైన బాత్రూం, రూమ్స్, భోజనశాల లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అనారోగ్య పాల వుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గర్ల్స్ హాస్టల్స్‌లో బాత్రూంలకు డోర్లు లేవని పేర్కొన్నారు. మెనూ పాటించకపోవడం వల్ల విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్నారన్నారు. జిల్లా ఉన్నత అధికారులు హాస్టళ్లపై పూర్తి దృష్టి పెట్టి వారికి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

# 'ఉక్కు'ను 'టెంకాయల ఫ్యాక్టరీ'గా మార్చారు

### 4 సార్లు శంకుస్థాపనలు చేసినా ఫలితం శూన్యం
### సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర శేఖర్

**ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్**

కడప ఉక్కు పరిశ్రమ అంటే టెంకాయలు కొట్టే ఫ్యాక్టరీగా పాలకులు దిగజార్చారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక కాంబేల్ హాస్పిటల్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తామని అప్పటి పాలక, ప్రతిపక్ష పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదంతో రాజముద్ర వేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేతులు ఎత్తివేయడంతో రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తామని నమ్మబలికి ఊరించిన వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చిట్టిమిటి చింతల వద్ద 'బ్రాహ్మణి స్టిల్స్' శంకుస్థాపన చేయడం, దాని చైర్మన్ గాలి జనార్ధన్ రెడ్డి భారీ ఆర్థిక నేరస్తునిగా పట్టుబడి జైలుకు పోవడంతో ఆగిపోయిందని తెలిపారు. తర్వాత నారా చంద్రబాబు నాయుడు కంబాలదిన్నె వద్ద హడావుడిగా రాష్ట్రంలో స్టీల్ అథారిటీ స్థానిక సంస్థ ను ఏర్పాటు చేస్తామని నమ్మబలికి, దానికి నిధులు కేటాయించకుండా, శ్రద్ధ వహించకుండా మోసపూరితంగా మభ్యపెట్టే శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారు అని ఆరోపించారు. మలి విడతలో వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి వచ్చి విడతలవారీగా 'ఎస్ఆర్ స్టీల్" కంపెనీకి రూ. 15 వేల కోట్లతో 2019 డిసెంబర్ 23న శంకుస్థాపన చేశారని వివరించారు. 'డిఫాల్ట్ కంపెనీ లిబర్టీ గుప్తా ఫ్యామిలీ గ్రూప్ సంస్థ" కు ఇచ్చి ఎత్తేశారని, మళ్లీ బొంబాయి సినీ తార జత్వానిని లైంగిక దోపిడీ చేసి మోసం చేసిన 'క్రిమినల్ సజ్జన్ జిందాల్ స్టీల్ కార్పొరేట్ సంస్థ'తో కలిసి శంకుస్థాపన చేసి భూములు, గనులు, నిధులు ఇచ్చారని వారు కూడా నిర్మించలేదని చెప్పారు. వెంటనే వారికి ఇచ్చిన భూములు, గనులు, నిధులు, మోసం చేసిన ఆ సంస్థ నుండి ప్రభుత్వ రాయల్టీతో కలిపి అసలు, వడ్డీ, ప్రజాధనాన్ని వెనక్కు వసూళ్ల చేయాలని డిమాండ్ చేశారు. ఫలితంగా కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని టెంకాయలు కొట్టే ఫ్యాక్టరీ'గా దిగజార్చారని ఎద్దేవా చేశారు. ఈ పరిణామాలన్నింటిని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. అత్యంత వెనుకబడిన రాయలసీమ లోని కడప జిల్లా ప్రజలకు నరేంద్ర మోడీ, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి నేడు 'గ్రామ రెవెన్యూ సదస్సులు' సెప్టెంబర్ 15 నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు అధికారిక ప్రకటన వెల్లడి చేశారని, ఈ 'గ్రామ రెవెన్యూ సదస్సు"లో గ్రామీణ బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, డివై ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి దాసు స్థానిక సిపిఎం మండల కమిటీ సభ్యులు విజయ్, వినయ్, మైలవరం మండల కార్యదర్శి కొండయ్య, లక్ష్మీనారాయణ సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదర్శనీయులు డాక్టర్ 'సర్వేపల్లి'

### - కలెక్టర్ లోతేటి శివశంకర్



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీలు, డిఇఒ

**ప్రజాశక్తి- కడప అర్బన్**

ప్రతి ఉపాధ్యాయుడూ విద్యార్థి విద్యలో నిత్యాన్వేషణగా ఉండి బోధన చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సభాభవంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదని, ప్రతి పేదవాడూ ఉన్నత విద్యను అభ్యసించాలని అన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి అనుకున్నది సాధించడానికి పేదరికం అడ్డు రాకూడదని ఆ కోవకు చెందిన విద్యార్థి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని చెప్పారు మరో ఎమ్మెల్సీ ఎమ్.వి.రామచంద్రారెడ్డి మాటాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. తల్లి, తండ్రి తర్వాత గురువు ఎంతో ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని అన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని 79 మంది ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మాన సత్కారాలు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీల చేతుల మీదుగా చేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మానసిక వైకల్యాన్ని జయించి ఆదర్శంగా నిలిచిన కామిశెట్టి వెంకట్‌ను కలెక్టర్ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో డిఇఒ అనురాధ, డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

## క్రీడా మైదానం ప్రారంభం

**ప్రజాశక్తి - కడప సిటీ**

కడప ప్రభుత్వ కళాశాలలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. 500 మీటర్ల వృత్తంలో 216 చదరపు అడుగుల క్రీడా మైదానం నిర్మించారు. ఈ మైదానం చుట్టూ వీక్షకుల కోసం 40 బెంచీలను వైద్య అధ్యాపకుల వితరణతో ఏర్పాటు చేశారు. గురువారం అడిషనల్ డిఎంఇ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ జి.రమాదేవి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌రెడ్డి మైదాన్ని ప్రారంభించారు. కళాశాల స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి డాక్టర్ వెంకట మనోజ్ వేడుకను పర్యవేక్షించారు. ఈ క్రీడా మైదానాన్ని ఉపయోగించుకుని విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర, అంతర్రాష్ట్ర కళాశాల పోటీలలో మరిన్ని పతకాలు సాధించాలని ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ ఆకా ంక్షించారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ హెచ్ఒడిలు, ప్రొఫెసర్లు, పీజీలు యూజీలు, సిబ్బంది కాంట్రాక్టర్, జె.బాల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు పరిశీలన

**ప్రజాశక్తి - కడప అర్బన్**

నగరపాలక సంస్థ, నగర అభివృద్ధి, శుభ్రత, పారిశుధ్య నిర్వహణలో అగ్రగామిగా నిలుస్తోందని అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం అన్నారు. గురువారం నగరంలోని శంకరాపురం, చిన్న చౌక్, ఎన్జీవో కాలనీలలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికలను పరిశీలించారు. వ్యర్థాలను తొలగించే విధానంపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్మికులకు అక్కడ ఉన్న వ్యర్థాలను పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఉదయాన్నే మెయిన్ రోడ్డు స్వీపింగ్ విధులను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. తద్వారా నగర శుభ్రత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిమజ్జనంలో పొరపాట్లకు తావు ఇవ్వొద్దు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

గణేష్ నిమజ్జనం సందర్భంగా పాత కడప చెరువును ఎస్‌పి హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. వినాయక విగ్రహాలను ఎత్తే భారీ క్రేన్లను, దానికి సంబంధించిన డ్రైవర్లను సిద్ధంగా ఉంచుకోవాలని పోలీసులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి ఘటనలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతంలో లైటింగ్, వైద్య సిబ్బంది, గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిమజ్జనం ప్రాంతంలో పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం వేళ ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా నిఘా ఉంచాలన్నారు. ఎస్‌పి వెంట అదనపు ఎస్‌పి జి. వెంకట రాముడు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ యు.వెంకటకుమార్, టూటౌన్ సిఐ నాగార్జున, తాలూకా సిఐ వెంకటేశ్వర్లు, సి.కె. దిన్నె సిఐ శివశంకర్ నాయక్, ఒంటిమిట్ట సి.ఐ కృష్ణంరాజు నాయక్, ఎస్.ఐలు, సిబ్బంది ఉన్నారు.

## 103 మందికి ఉద్యోగాలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో 103 మందికి ఉద్యోగాలు లభించాయని ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైదుకూరు, జమ్మలమడుగుల నిర్వహించిన జాబ్ మేళాకు 260 మంది హాజరు కాగా 103 మంది ఎంపికయ్యారని తెలిపారు.

## మట్టి గణేష్ విగ్రహాలను ప్రోత్సహించాలి

**ప్రజాశక్తి - కడప**

సహజ రంగులతో తయారు చేసిన మట్టి గణేష్ విగ్రహాలను ప్రోత్సహించి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని కలెక్టర్ శివశంకర్ లోతేటి జిల్లా ప్రజలకు గురువారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరం సమిష్టిగా కృషిచేయడం వల్ల ఒక గొప్ప మార్పును సాధించవచ్చని తెలిపారు. ఁమట్టి విగ్రహాలను తయారు చేయడం ఖర్చుకూడా తగ్గి ఆర్థికంగా కూడా కొంత వెసులుబాటు కలుగుతుందన్నారు. చెరువులు, జలవనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గిందామమని పేర్కొన్నారు. చెరువులు, సరస్సులు జలాశయాలు, జీవరాశుల మనుగడ ముఖ్యమని వాటి సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు విషపదార్థాలవినియోగం వల్ల జలవనరులు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. వృక్ష, జంతు జీవనం పై ప్రభావం పడుతుందని చెప్పారు. పైగా ఊపిరితిత్తులతో పాటు, చర్మ, రక్త, కంటి సంబంధ వ్యాధులతో పాటు ఇతర వ్యాధులు వస్తాయన్నారు. విగ్రహాల అలంకరణకు ప్లాస్టిక్, థర్మోకోల్ వంటి వస్తువులు వాడటం వల్ల జలవనరులు కలుషితమవుతాయి.

## గంజాయి నిర్మూలనకు దాడులు ఉధృతం : ఎస్‌పి

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** జిల్లాలో గంజాయి నిర్మూలనకు విస్తృతంగా దాడులు నిర్వహించాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. గురువారం జిల్లాలో గంజాయి నిర్మూలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డిఎన్‌సిసి ( డిస్ట్రిక్ట్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ ) టీంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి జిల్లాలోకి రాకుండా నిఘా ఉంచి కట్టడి చేయాలని ఆదేశించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డిఎన్‌సిసి టీమ్ ఆధ్వర్యంలో దాడులు, నమోదైన కేసుల వివరాల గురించి ఆరా తీశారు. 40 రోజుల్లో 17 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్టు చేసి 29 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ 100 మందికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు డిఎన్‌సిసి అధికారులు తెలిపారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ యు.వెంకట కుమార్, డిఎన్‌సిసి అధికారులు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

## కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

**ప్రజాశక్తి - కడప :** జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్‌జోన్ అండర్ -23 మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 51.0 ఓవర్లలో 223 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని జాఫర్ అలీఖాన్ 79, శివ కేశవ రాయల్ 40 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని కనీష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 7 వికెట్లు తీసుకున్నాడు. సాయి సూర్య తేజ రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 21.4 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది.

## దేశ నిర్మాణంలో ఎల్ఐసి పాత్ర కీలకం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

వ్యాపారంలో, సేవల్లో, దేశనిర్మాణంలో ఎల్ఐసి పాత్ర కీలకమని సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి రవికుమార్ అన్నారు. గురువారం బీమా వారోత్సవాల్లో భాగంగా ఎల్ఐసి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పెద్ద ఎత్తున ఉద్యోగులు, అధికారులు, ఏజెంట్లు, పాలసీదారులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఎస్‌డిఎం మాట్లాడుతూ 70 శాతం మార్కెట్ షేర్‌తో ఎల్ఐసి లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌ను శాసిస్తుందని అన్నారు. 98.4 శాతం క్లెయిమ్‌ల చెల్లింపుతో పాలసీదారుల కుటుంబాలకు నమ్మకమైన నేస్తంగా భద్రత కల్పిస్తోందన్నారు. దేశ అభివృద్ధికి అవసరమైన నిధులు అందించడంలో ఎల్ఐసితో సరితూగే ఏ సంస్థ దేశంలో లేదన్నారు. టెక్నాలజీ, నైపుణ్యాలు, వేగం ఇలా ఏ అంశం తీసుకున్నా ఎల్ఐసి ప్రపంచ ప్రమాణాలతో పనిచేస్తూ ఉందన్నారు. జీవన్ ఉత్సవ్, జీవన్ ధారా 2, జీవన్ శాంతి, నివేష్ ప్లస్ లాంటి పాలసీలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ర్యాలీలో మార్కెటింగ్ మేనేజర్ శ్యాంసుందర్రావు, సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, కడప శాఖాధిపతులు శ్రీనాథ్ రెడ్డి, వెంకటకృష్ణ, సంఘాల ప్రతినిధులు నిత్యానంద రెడ్డి, చంద్రపాల్, సంజయ్, రఘునాథరెడ్డి, అవధానం శ్రీనివాస్, సుధీకర్, రామాంజనేయులు, రెడ్డి భాస్కర్, హబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

## ఆంజనేయులుకు వైవీయూ డాక్టరేట్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

యోగివేమన విశ్వ విద్యాలయం వాణిజ్య శాస్త్ర శాఖ స్కాలర్ డి.ఆంజనేయులుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ వాణిజ్య శాస్త్ర శాఖ విభాగాధిపతి, సహ ఆచార్యులు డాక్టర్ జి.హరినాథ్ పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆఫ్ షేర్ ప్రైస్ ఫ్లక్చ్యుయేషన్స్ ఇన్ ఇండియన్ స్టాక్ ఎక్స్ఛేంజ్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు సెలెక్ట్ సెక్టోరియల్ షేర్స్ ఆఫ్ ఎన్ఎస్ఎఫ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. డాక్టరేట్ రావడంపై విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి, ఉప ప్రధానాచార్యులు ఆచార్య పద్మ, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## బిసి హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి -కడప అర్బన్ :** బిసి హాస్టళ్ల సమస్యలు పరిష్కరించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య నాయకులు కోరారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల అధికారి భరత్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్స్ సమస్యలపైన విద్యార్థులకు వార్డెన్లు ఖర్చుపెట్టిన మెస్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు ప్రక్క బిల్డింగ్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బయన్న పాల్గొన్నారు.

## వైద్య సేవలు ఉచితంగా అందించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవ పథకం కింద ఆరోగ్య సేవలు పొందిన వారి నుంచి ఫిర్యాదులు వస్తే ఆస్పత్రులపై చర్యలు తప్పవని కలెక్టర్ శివశంకర్ లోతేటి హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాం బర్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఆసుపత్రులపై ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా అందిన ఫిర్యాదులపై సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యంతో కలెక్టర్ విచారణ చేసి జరిమానాలు విధించారు. కడపలో హోలిస్టిక్, తిరుమల, సన్ రైజ్ ఆసుపత్రులు, ప్రొద్దుటూరులోని కెవిఆర్ ఆసుపత్రి, పులివెందులలోని శ్రీ రాజా రాఘవేంద్ర ఆసుపత్రి మొత్తం ఐదు నెట్వర్క్ ఆస్పత్రుల్లో 14 ఫిర్యాదులు వచ్చాయని ఆరోగ్యశ్రీ కో - ఆర్డినేటర్ బాలాంజనేయులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ డబ్బులు ఎందుకు తీసుకోవాల్సి వచ్చి ంది, ఎందుకు రీఫండ్ చేయాల్సి వచ్చిందన్న అంశంపై సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఆస్పత్రికి వచ్చేలోపలే ప్రాథమికంగా కొన్ని పరీక్షలు చేసుకుని కొంత మొత్తం ఖర్చు చేసి వస్తున్నారని, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించినప్పటికీ ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా లబ్ధిదారులు ఫిర్యాదులు చేస్తున్నారని ఆస్పత్రుల ప్రతినిధులు కలెక్టర్‌కు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవల లబ్ధిదారులకు ఇబ్బంది కల్గించే ఏ చర్యలైనా తప్పుగానే పరిగణిస్తామని కలెక్టర్ చెప్పారు. తరువాత అయిదు ఆసుపత్రులకు సంబంధించి మొత్తం 14 కేసులలో 10 కేసులకు రూ.1.54 లక్షలు పెనాల్టీ చెల్లించాలని కలెక్టర్ ఆదేశి ంచారు. మిగిలిన 4 కేసులకు సంబంధించి ఆసుపత్రుల వారి తరపున తగిన ఆధారాలు ఉన్నందున హెచ్చరించి కొట్టి వేశారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, వేణుగోపాల్‌రెడ్డి, డిఎం రమేష్ బాబు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని ప్రతిష్టిద్దాం

**ప్రజాశక్తి - బద్వేలు :** రాబోవు గణపతి పండుగను పురస్కరించుకొని ప్రజలందరూ మట్టి గణపతులు ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని బద్వేల్ అర్బన్ సిఐ రాజగోపాల్ యాదవ్ తెలిపారు. బద్వేల్ డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అర్బన్ స్టేషన్‌లో మట్టి గణపతులను ప్రతిష్టిద్దాం - పర్యావరణాన్ని కపాడుదాం అనే పోస్టర్ ను ఆవిష్కరించారు. ముందుగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘానికి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం పర్యావరణం కాలుష్యం వల్ల భవిష్యత్తులో అనేక ఉపద్రవాలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. గణపతి పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ప్రజలు తావివ్వకుండా సంతోషంగా కుల మత ప్రాంతాల అతీతంగా జరుపుకోవాలని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ డివైఎఫ్ఐ యువజన సంఘం పోరాటాలే కాదు ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో బద్వేల్ ఎస్ఐ సత్యనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, ఆదిల్, పట్టణ నాయకులు షబ్బీర్, శంకర్ పాల్గొన్నారు.

## విద్యుత్ నియమాలను పాటించాలి : ఎస్ఇ

**ప్రజాశక్తి - కడప :** విద్యుత్.. భూతంతో సమానమని, చిన్నతప్పిదం పెను విషాదానికి దారితీస్తుందని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. వినాయక చవితి సందర్భంగా తన ఛాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచి ంచారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టి వినాయక చవితి పండుగను ఆస్వా దించాలని చెప్పారు. పలుమార్లు సూచనలు చేస్తున్నా లక్ష్యం పెట్టకుండా వినా యక పందిళ్లను విద్యుత్ లైన్లకు అతి సమీపంలో వేస్తున్నారని, దీనివల్ల ప్రమా దం పొంచి ఉందని పేర్కొన్నారు. పందిళ్లను లైన్లకు దూరంగా వేసు కోవాలన్నారు. నిర్లక్ష్యాన్ని వీడి నిండు ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. వినాయక పందిళ్లకు ఉపయోగించే విద్యుత్ వైర్లను అతు కులు లేకుండా నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు ఉపయోగించాలని తెలి యజేశారు. విద్యుత్తు లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పందిళ్లు ఏర్పాటు చేయ రాదని చెప్పారు. భారీ విగ్రహాలు ఊరేగింపులు చేసేటప్పుడు విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే విద్యుత్తు సిబ్బంది సహకారాలు తీసుకోవాలని చెప్పారు.

## నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

**ప్రజాశక్తి - కడప :** వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఎన్‌సిసి క్యాంపులు ఉపయోగపడుతాయని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కర్నూల్ సూర్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. గురువారం తెలుగుగంగ కాలనీలో తెలుగుంగ కాలనీలో ఎన్‌సిసి క్యాంపు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఈనెల 14 వరకు కంబైండ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ ( సిఎటిసి) నిర్వహిస్తున్నట్లు క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ నీలయ్య తెలియజేశారు. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి దాదాపు 550 మంది కేడెట్లు పాల్గొంటారని పేర్కొన్నారు. క్యాంపులో డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, గుడారాల నిర్మాణం, ఆయుధ విడిభాగాలను జోడించడం, విడదీయడం వంటి వాటిలో ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు మహేష్, శివరాం, గంగాధర్ పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్, సిఎల్ఎన్ రెడ్డి, కొండారెడ్డి, బన్నెట్ ఆఫీస్ సిబ్బంది సూపరింటెండెంట్ సరస్వతి, డేవిడ్ సీనియర్ అసిస్టెంట్లు ఉమా, ప్రియ, జయసుధ జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

**ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె :** ఆహారం, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని ఐసిడిఎస్ సిడిపిఒ రమాదేవి పేర్కొన్నారు గురువారం నాడు సంపూర్ణత అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా పోషకాహార వారోత్సవాలు , వాటి ప్రాముఖ్యత గురించి ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గర్భిణులు, బాలింతలు,పిల్లలు, కిషోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, గర్భిణుల్లో వచ్చే రక్తహీనత తదితరాలపై వివరించారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీధర్ సమక్షంలో అన్నప్రాసన, సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్ డాక్టర్ సునీత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్ పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సిడిపిఒ

## అంగన్వాడీలకు పెండింగ్ వేతనాలివ్వాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు వేతనాలు రాక తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి, కోశాధికారి ఎం.పి అంజని దేవి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగ వస్తోందని పేర్కొన్నారు. నెలనెలా వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీతాలు రాకపోతే పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కనుక అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్స్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని తెలిపారు.

## సింహరాజ్‌కు సాహిత్య పురస్కారం

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** నెల్లూరుకు చెందిన ప్రముఖకవి, ప్రముఖ వైద్యులు సింహరాజ్ (డాక్టర్ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసా దరావు) 'మహాకవి' డాక్టర్ గడి యారం వేంకట శేషశాస్త్రి 43వ సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు రచన సాహిత్య వేదిక కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురస్కార ప్రదాన సభ రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబరు 6న నిర్వహించనున్నట్లు తెలిపారు. 1982 నుంచి ప్రతి ఏటా రాష్ట్రస్థాయిలో కావ్యాలకు పోటీ నిర్వహించి ఎంపికైన కావ్యానికి బహూకరిస్తూ వస్తున్న ఈ అవార్డుకు 2024 సంవత్సరానికి సింహరాజ్ రచించిన 'శ్రీ శంభు భారతం' (ఛత్రపతి శంభాజీ పద్య ప్రబంధం) అనే చారిత్రక కావ్యం ఎంపికైనట్లు పేర్కొన్నారు. పురస్కార ప్రదాన సభలో సింహరాజ్‌కు అవార్డు, రూ.10వేలు బహుమతి, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న సలావుద్దీన్

కడప నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీ ప్రధాన రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫారం కాలిపోయి ఆరు ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతి కావడం బాధాకరమని, ఈ ప్రమా దం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే సంభ వించిందని ప్రముఖ సంఘ సేవకులు, కాంగ్రెస్ నేత సలావుద్దీన్ అన్నారు. గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో విద్యుత్ ప్రమాదాలు జరుగుతుంటే విద్యుత్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమన్నారు. కడపలో ఎక్కడ చూసినా విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని, వర్షాలు పడితే ఇంకా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## బోగస్ పింఛన్లపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - కమలాపురం టౌన్**

పత్రాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మండలంలో సామాజిక తనిఖీ ద్వారా బయట పడిన బోగస్ పెన్షన్లపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అధికారులను ఆదేశించారు. ఉపాధి పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్‌పై గుర్తించి అవకతవకలపై గురువారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీలలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన వివరాలను సామాజిక తనిఖీ బృం దం చదివి విన్పించారు. పంచాయతీలో జరిగిన పనులు, రికార్డుల్లో నమోదు అయిన వివరాలు, సోషల్ ఆడిట్‌లో బయటపపడ్డ బోగస్ పెన్షన్ల వివరాలను తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. సంబటూరు గ్రామంలో అంగవనైకల్యం పేరుతో పది మంది పింఛన్లు పొందుతున్నారని, పంచాయతీ పరిధిలోని వాలంటరీగా విధులు నిర్వహించిన ఓ వ్యక్తి కుటుంబంలోనే నలుగురు అనర్హులు అంగవైకల్యం పెన్షన్లు తీసుకుంటున్నారని తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. బాధ్యులైన అధికారులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని పుత్తా చైతన్య రెడ్డి ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లా డుతూ ఇతర జిల్లాల్లో వికలత్వ సర్టిఫికెట్లు పొందిన బోగస్ పెన్షన్లపై మంత్రి దృష్టికి ఇదివరకే తీసు కెళ్లామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గండి భారతి, ఎంపిడిఒ జ్యోతి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు

## ఉత్సాహంగా కెఎల్ఎం ఫ్రెషర్స్ డే

**ప్రజాశక్తి - కడప అర్బన్**

నూతన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ కెఎల్ఎం ఫ్రెషర్ డే ఆద్యంతం కేరింతలు, ఉత్సాహం మధ్య సాగింది. గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైవీయూ బయో టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమతి శంకర్ హాజరై మాట్లాడారు. నిర్దేశిత లక్ష్యం వైపు సాగాలని కోరారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని పేర్కొన్నారు. కరస్పాండెంట్ కె. రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థినులు కోర్సులు విజయవంతంగా ముగించాలని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ మాట్లాడుతూ పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని విద్యార్థినులు ఆ విధంగా ముందుకు అడుగు వేయాలని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలోని అన్ని వసతులు కల్పించడంలో తాము ఎప్పుడు ముందు ఉంటామని, అన్ని వనరులను సరైన విధంగా వినియోగించుకుని ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఉర్రుతలు ఊగించాయి.

నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిఎంహెచ్‌ఒ నాగరాజు

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి సారించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని సుంకేసుల గ్రామం వద్ద ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా వైద్య అధికారుల బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో విద్యార్థుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు తప్పక నిర్వహి స్తామన్నారు. వంట తయారీలో శుభ్రత, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహశీల్దార్, సిబ్బందితో చర్చిస్తున్న డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

## నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని అల్లాడుపల్లె వద్ద కుందూ నదిపై వినాయక విగ్రహ నిమజ్జనానికి మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ గురువారం ఏర్పాట్లు పర్యవేక్షించారు. నిమజ్జనానికి వాహనాలు ఏ మార్గంలో తరలించాలి.. భారీకేడ్లు, లైటింగ్ వంటి అంశాలపై సిబ్బందితో చర్చించారు. నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను అల్లాడుపల్లెతోపాటు అన్నవరం వద్ద నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. నదిలో నీటి ఉధృతి అధికంగా ఉందన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. పోలీస్ సిబ్బందితోపాటు రెవెన్యూ పంచాయతీ సిబ్బంది నిమజ్జనం సందర్భంగా అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సిఐ జె.శివ శంకర్, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, ఎస్ఐ చిన్న పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## బుడమేరు గండ్లు పూడ్చకనే వరద

**ప్రజాశక్తి - చాపాడు**

గత ప్రభుత్వంలో బుడమేరు గండ్లు పూడ్చకపోవడం వల్లనే ప్రస్తుత వరదకు కారణమని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన వల్లనే విజయవాడ నగరానికి వరద ముప్పు వచ్చిందన్నారు. గత అయిదేళ్లలో పాలనను గాలికి వదిలేశారన్నారు. రాష్ట్రంలో పరిపాలన ఎలా జరుగుతుందని తెలుసుకోకుండా నాడు వైసిపి నాయకులు చేసిన నిర్వాకం ఏమిటంటే పోలవరం కాలువ కట్టమట్టిని కూడా దోచుకోవడమే అన్నారు. కాలువ మట్టి ఎత్తకుండా ఉంటే నీరు కృష్ణా నదిలోకి వెళ్లేదన్నారు. బుడమేరు ప్రాజెక్టుకు కూడా గత పాలనలోనే గండ్లు పడినా పట్టించుకోనే నాథుడే లేర న్నారు. తప్పుడు ప్రచారం తప్ప, బాధితులకు అండగా ఉందామనే ఆలోచన లేద న్నారు. ఇకనైనా మీ ప్రవర్తనను మార్చుకొని బాధితులకు సాయం చేయాలన్నారు.

## వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

**ప్రజాశక్తి - వేంపల్లె**

విజయవాడకు వచ్చిన విపత్తును ఎదుర్కోనేందుకు వరద బాధితుల సహాయార్థం వేంపల్లెలో విరాళాలు సేకరణ చేపట్టారు. గురువారం టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో వేంపల్లెలోని ప్రధాన రహదారుల్లో టిడిపి నేతలు ఆయా దుకాణాల వద్దకు వెళ్లి తోచిన విరాళాలు ఇవ్వాలని కోరారు. చాలామంది స్పందించి భారీగా విరాళాలిచ్చారు. మానవతా దృక్పథంతో విరాళాలు ఇవ్వడం సంతోషకరమని మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ తెలిపారు.

**ప్రొద్దుటూరు** :విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రొద్దుటూరు పారిశుధ్య కార్మికులు కదిలారు. బుధవారం, గురువారాల్లో సుమారు 100 మందికిపైగా కార్మికులు వెళ్లారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు ఆధ్వర్యంలో బయల్దేరారు.

## గుండెపోటుతో విఆర్‌ఎ రవి మృతి

**ప్రజాశక్తి - చాపాడు**

అల్లాడుపల్లెకు చెందిన విఆర్‌ఎ రవి(50) గుండెపోటుతో గురువారం మృతి చెం దాడు. బంధువులు అందించిన వివరాలు ప్రకా రం.. రవికి అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో చికిత్స కోసం తరలించే ప్రయత్నంలోపే మృతి చెం దాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వీరిద్దరూ వివా హితులే. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరారు. విఆర్‌ఎ కుటుంబసభ్యులకు తహశీల్దార్ రవీంద్రారెడ్డి, సిబ్బంది సంతాపం తెలి పారు. దహన ఖర్చులకు ప్రభుత్వం నుంచి సాయాన్ని అందజేశారు.

# క్రైం కార్నర్

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

కుందేళ్ల వేట కోసం పొలంలోకి వెళ్లి ప్రమాదవశాత్తూ విద్యుదా ఘాతానికి గురై అంగలగుత్తి బాలమల్లయ్య (38) మృతి చెందాడు. ఎస్ఐ మైనుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెనికలపాడు గ్రామానికి చెందిన బాల మల్లయ్య బుధవారం రాత్రి కుందేళ్ల వేట కోసం యామవరం గ్రామానికి వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన నాగయ్య పొలంలో ఉన్న స్టార్టర్ దగ్గరకు నీళ్లు తాగేందుకు వెళ్లాడు. ప్రమా దవశాత్తూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బాలమల్లయ్య భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మృతి చెందిన బాల మల్లయ్య

## 13 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

**- రూ.30,700 నగదు స్వాధీనం**

**ప్రజాశక్తి - వేంపల్లె**

మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. వారి వద్ద నుండి రూ.13,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సిఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు టి వెలమవారిపల్లెలో జూదం ఆడుతున్న వారిపై ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఉపాధ్యాయులు సమాజానికి మార్గ నిర్దేశకులు

కలెక్టరేట్‌లో నృత్య ప్రదర్శనిచ్చిన ముద్ర అకాడమీ చిన్నారులు

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఉపాధ్యాయుల సమాజానికి మార్గ నిర్దేశకులని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ 136వ జయంతిని పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదర్శ ఉపాధ్యాయులు జి.కవిత, వై.చంద్రకళ, జి.సుధా భారతి, యు.వెంకటేశ్వరి, ఎట్క.నరసింహారెడ్డి, శ్రీనివా సులురెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకుడు సంగమేశ్వరరెడ్డి, తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమారాజా, బాలం సుబ్బరాయుడు, నాగరాజు, ప్రసాద్, మహబూబ్ భాషా ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** నగరంలోని అల్మాస్ పేట సర్కిల్‌లో ఉన్న

హెచ్‌ఎంకు పండ్లు అందజేస్తున్న వైస్ చైర్మన్ హిమబిందు

ప్రధానమంత్రి కౌశల్ కేంద్ర స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని సీనియర్ గురువులు, భారత రాష్ట్రపతి పురస్కార అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, విశ్వ భారతి ఏడెడ్ స్కూల్ ఉపాధ్యాయురాలు కె.సత్యవతి, జి ఆర్ స్కూల్ కరస్పాండెంట్ షేక్. అబ్దుల్ రహీం ను మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా సర్వ శిక్ష అభియాన్ సెక్టోరియల్ ఆఫీసర్ ఎం.కేశవరెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, ప్రముఖ సీనియర్ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్, రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సయ్యద్ హిదాయతుల్లా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానమంత్రి కౌశల్ కేంద్ర సెంటర్ మేనేజర్ ఎస్.కె.అంజుమ్, మొల్ల సాహితీ పీఠం కార్యవర్గ సభ్యులు పార్వతి, శివశంకర్, ఉపాధ్యాయులు, మౌలానా సొసైటీ సభ్యులు, సుల్తాన్ సలావుద్దీన్, సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు. **గురుకుల్ విద్యాపీఠ్‌లో..** గురుకుల్ విద్యాపీఠ్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులు గురువులను పూజించారు. బహుమతులతో సత్కరించారు. ఉపాధ్యాయులు ఆటపాటలతో సందడి చేశారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎవిఆర్ విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వీరా కుమారి, సిఇఒ ఎ.ఎల్ వివేకానంద, పాఠశాల ప్రిన్సిపల్ ఎం. ఎన్. ముని చంద్ర, వైస్ ప్రిన్సిపల్ నరసింహ పాల్గొన్నారు. **పాత కడప జడ్‌పి హైస్కూల్లో ..** పాత కడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం విశ్వభారతి, ఉపాధ్యాయులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్ గుంటా హిమబిందు హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు పండ్లు ఇచ్చి గౌరవించారు. **కలసపాడు :** సెయింట్ ఆంటోని ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిత్తా ప్రభావతి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **బద్వేలు :** పట్టణంలోని సిద్ధవటం రోడ్డులో ఉన్న సృజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో గురుపూజోత్సవం నిర్వహించారు. బి.వి.ఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు షేక్ యూసఫ్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ హెడ్మాస్టర్ షేక్ మహబూబ్ సాహెబ్, రిటైర్డ్ తెలుగు పండి తులు సి.రంగ రాజు, పాణ్యం బాల ఓబులయ్య, రిటైర్డ్ హైస్కూల్ హెడ్మాష్టర్, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ పైడిమర్రి సుబ్రహ్మణ్యం, సృజన్ హైస్కూల్ ఉపాధ్యా యులను దుశ్శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పాలేటి శ్రీనివాసులురెడ్డి, కమిటీ గౌరవాధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, మహనీయుల ఆశయాల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బద్వేలు గురుమూర్తి, సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి కె .వి సుబ్బారావు, పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులు ఎస్.ఎ సత్తార్, యస్.అన్వర్ భాష సంఘసేవకులు నారాయణరెడ్డి, బొజ్జా బాల గురన్న పాఠశాల ఉపాధ్యాయులు, బాల బాలికలు హాజరయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.పెంచలయ్య, స్టాఫ్ సెక్రటరీ మాదన విజయ కుమార్ , ఉపాధ్యాయులు టి.వి. సుబ్బారావు, పి.సుబ్బరాయుడు, ఎస్.వరలక్ష్మి, ఎస్.గౌస్ బాషా, వై.రామ మోహన్, ఇందిర, ఎం.నరేష్ పాల్గొన్నారు. **ఖాజీపేట :** ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కొత్తనెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, పాఠశాల చైర్ పర్సన్ బీరం సరస్వతమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** కోరగుంటపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రామసుబ్బారెడ్డి సర్వేపల్లి వ్యక్తిత్వం, ఉపాధ్యాయుడిగా చేసిన సేవలు కొనియాడారు. 2023-24 విద్యా సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను పాఠశాల ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర, సుబ్బరాయుడు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంగన్వాడీ కార్యకర్త, విద్యార్థులు పాల్గొన్నారు. **మైదుకూరు :** మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, కళాశాలల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక రాణి తిరుమలేవి డిగ్రీ కళాశాలలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ టీ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎల్ తరుణింద్ర శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** మండలంలోని మహాదేవపల్లి గ్రామపరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యావేత్త, వై.వెంకటప్రసాద్, పులివెందుల నియోజకవర్గం బిసి టిడిపి నాయకుడు కృష్ణగిరి రమేష్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పొద్దుటూరు :** ఉపాధ్యాయలోకానికి ఆదర్శప్రాయుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలుగువారు కావడం భారత దేశానికి గర్వకారణమని ఐకాన్ ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ ఇలియాస్ అన్నారు. ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గౌస్‌లాజంను సన్మానించారు. **పులివెందుల రూరల్ :** ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు పట్టణంలో పలుచోట్ల గురువారం ఘనంగా జరిగాయి. ఆహార విజ్ఞశాస్త్ర, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ, అధ్యాపకులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అరుణ, డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ జయమ్మ, ఇంజినీర్ నజ్మా, డాక్టర్ నివేదిత, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ జాకిర్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఉపాధ్యాయులకు ఆదర్శమని ముద్దనూరు బాల,బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజబాబు, శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రాథమిక స్టేషన్, మెయిన్, పెనికలపాడు హెచ్‌డబ్ల్యూ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు సాంబశివారెడ్డి, రామ మోహన్‌రావ్, సంజీవప్ప ఆధ్వర్యంలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **జమ్మలమడుగు రూరల్ :** ఉత్తమ ఉపాధ్యాయుడిగా మైలవరం మండలం వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు ఒ.నాగేంద్రకుమార్‌ను గురువారం కలెక్టర్ లోతేటి శివశంకర్, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలు రామ చంద్రారెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు.

సన్మానం పొందుతున్న నాగేంద్ర కుమార్

పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

## గులాబీరంగు పురుగు ఆశించకుండా చర్యలు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పత్తి పంటను గులాబీ రంగు పురుగు ఆశించకుండా ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించిరు. పట్టణ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో ప్రత్తి పంట పొలాలను గురువారం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ రంగు పురుగును గమనించామన్నారు. పత్తి పంట వేసిన 60 రోజుల నుంచి పంటలో కాయ తొలిచే పురుగు ముఖ్యంగా గులాబీ రంగు పురుగు రాకమునుపే ముందస్తు చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ముఖ్యంగా వేపనూనె కషాయం, లింగాకర్షణ బుట్టలు ఎకరానికి 4 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి నాగభూషణ్‌రెడ్డి, స్థానిక మండల వ్యవసాయ అధికారి నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

**వేంపల్లె :** పత్తి పంటలో గులాబీ రంగు పురుగును నివారించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్ తెలిపారు. మండలంలోని కత్తులూరు గ్రామంలో పత్తి పంటను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. పత్తి పంటలో ఉన్న గులాబీ పురుగులను గుర్తించి, నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి నాగభూషణ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు ఎరువులు విక్రయించాలి

**ప్రజాశక్తి - మైదుకూరు**

ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన ఎరువులు, పురుగు మందులను విత్తన డీలర్లు ఆధార్‌కార్డు, డిబిటి వ్యవస్థ ద్వారా విక్రయించాలని వ్యవసాయ ఎడిఎ కృష్ణమూర్తి ఆదేశించారు. మైదుకూరులో ఎరువుల దుకాణాలు, విత్తనాల డీలర్లతో గురువారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ నవీకరణ చేసుకోవాలని సూచించారు. జి2, జి3 పర్మిషన్లను ఉన్నవి మాత్రమే అమ్మకాలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఎఒ ప్రసన్న, ఎరువులు, విత్తన దుకాణదారులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఒ రాజేశ్వరి తెలిపారు. సున్నపురాళ్లపల్లి గ్రామంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ నుంచి ఇచ్చే ప్రతి ఆహారం చాలా పౌష్టిక విలువలు కలిగినవిగా పేర్కొన్నారు. తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. లింగ నిర్ధారణ చేపించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత, శ్రీకాంత్, గ్రామ పెద్దలు శ్రీనివాసులు, రాఘవరెడ్డి, రాముడు, చలపతి, అంగన్వాడీ సిబ్బంది లక్ష్మిదేవి, హుస్సేనమ్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**మైదుకూరు :** రక్తహీనతపై గర్భిణులు అవగాహన కలిగి ఉండాలని, ప్రసవ సమయంలో రక్తం చాలా విలువైందని ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్, జివి సత్రం అంగన్వాడీ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. సాక్ష్యం అంగన్వాడీ కేంద్రంలో పోషణ వాటిక ఏర్పాటు చేసి అందులో పండించిన ఆకు కూరలు, కూరగాయలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు ఐసి డిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ శ్రీదేవి, సూపర్వైజర్స్, అంగ న్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

**చాపాడు :** పౌష్టికాహారంతో ఎన్నో ఆరోగ్య ఉప యోగాలు ఉన్నా యని ఐసిడిఎస్ చాపాడు ప్రాజెక్టు సిడిపిఒ సావిత్రమ్మ తెలి పారు. పోషక వారోత్సవాల్లో భాగంగా సోమా పురం అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శుభరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు రాధా, అంజనమ్మ, అరుణ, జిఎంఎస్ కె.కళ, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. **చక్రాయపేట :** గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ సునీత పేర్కొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సురభి గ్రామం గాజులపేట అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను సిడిపిఒ సునీత ప్రారంభించారు. చక్రాయపేట సెక్టర్ మారెళ్ళమడక పంచాయతీ కొండ వాళ్లపల్లె, గండి కొవ్వూరు పంచాయతీలోని బొజ్జిరెడ్డిగారిపల్లెలో ఆమె అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుభద్రమ్మ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్త హీనతను నివారించవచ్చని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఈశ్వరి పేర్కొన్నారు. పెద్దశెట్టిపల్లె పంచాయతీలోని శంకరాపురం అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ అంజలి, ఏఎన్‌యం సుజాత, అంగన్వాడీ టీచర్స్ గీతాలక్ష్మి, రాజ్యలక్ష్మి, మహాలక్ష్మి, హాజరాబీ, తులసి, ఆశా కార్యకర్తలు లక్ష్మిదేవి, వరలక్ష్మి, ఆయా ప్రకాషమ్మ పాల్గొన్నారు.

## 8 నుంచి శ్రీరంగనాథ స్వామి నూలు పూజ ఉత్సవాలు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పులివెందులలో వెలసిన శ్రీరంగనాథస్వామి వారి నూలుపూజ ఉత్సవాలు ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యవర్గం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో భాగంగా ఈనెల 14న శ్రీరంగనాథ స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. కార్యక్రమాల్లో పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## గృహోపకరణాలు వితరణ

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

దివంగత కంటి వైద్యనిపుణులు పురుషోత్తమరెడ్డి ఆరవ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం ముద్దనూరు రోడ్డులో ఉన్న విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, గోటూరు చిన్నప్ప, బ్రదర్ రఘుకర్ పాల్గొన్నారు. వీరు పురుషోత్తమరెడ్డి చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. అనంతరం పురుషోత్తమరెడ్డి కుమారుడు విలియం సత్యానందరెడ్డి సమకూర్చిన గృహోపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, రాజారెడ్డి ఆసుపత్రి సహాయకులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## 9న యామవరంలో భజన పోటీలు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

వినాయక చవితి పర్వదినం సందర్భంగా యామవరం గ్రామంలో ఈనెల 9న రాత్రి తాళాల భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహు మతి రూ.10,016, రెండవ బహుమతి రూ.5,016, మూడవ బహుమతి రూ. 3,016, నాల్గవ బహుమతి రూ.1,016 ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రవేశ రుసుం రూ.216 చెల్లించాల్సి ఉందన్నారు. ఆధార్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకు రావాలన్నారు. ఎవరి వాయిద్యాలు వారే తెచ్చుకోవాలన్నారు. న్యాయ నిర్ణేతలు, కమిటీ వారిదే తుది నిర్ణయమన్నారు. పోటీకి నియమ నిబంధనలు పాటిం చాలన్నారు. భజన బృందాలకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఎస్‌ఒ బిఎం జయసింహను సన్మానిస్తున్న డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు

## సామాజిక సేవలో ఎల్ఐసి పాత్ర ప్రశంసనీయం

**ప్రజాశక్తి - మైదుకూరు**

గ్రామీణ ప్రాంతాల్ల ఎల్ఐసి తరపున చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని వక్తలు కొనియాడారు. ఎల్ఐసి 68వ వార్షికోత్సవ వారోత్సవాల్లో భాగంగా మైదుకూరు ఎల్ఐసి శాటిలైట్ కార్యాలయంలో గురువారం సిబ్బంది, ఏజెంట్లు పలు కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టలో సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన, సంస్థకు సంబంధించి క్విజ్ ఏజెంట్లకు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నారు. అనంతరం ఏజెంట్లు తమ విస్తరణాధికారుల (డెవలప్‌మెంట్ ఆఫీసర్స్)ను గురుపూజోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ జె.జయసింహ, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పి.సుప్రసన్న సురేష్, ఎస్.సాదర్, పి.వి.సురేష్, జి.మధుసూదన్‌రెడ్డి, ఎఒ పి.సుహాసిని, ఎఎఒ ఎం.రామకృష్ణారావు, సబ్‌స్టాఫ్ కె.వి.రమణ, ఏజెంట్లు పాల్గొన్నారు.

## మైదుకూరు ఎంపిడిఒగా లక్ష్మీదేవి

**ప్రజాశక్తి - మైదుకూరు**

మైదుకూరు ఎంపిడిఒగా (ఎఫ్ఎసి) లక్ష్మీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో లక్కిరెడ్డిపల్లి, చింతకొమ్మదిన్నె మండలాల్లో ఎంపిడిఒగా విధులు నిర్వహిం చానన్నారు. ప్రజా ప్రతినిధులు, స్థానిక సిబ్బందితో కలిసి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాలలో తాగునీరు, పరిశుభ్రతకు ప్రాధాన్య మిచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు.

## ఒకరి నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు

**ప్రజాశక్తి - చక్రాయపేట**

ఒకరు నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి కంటిచూపు వస్తుందని సురభి వైద్యాధికారి పేర్కొన్నారు. నేత్రదాన పక్షోత్సవాలు పునస్కరించుకొని గురువారం సురభి ప్రాథమిక కేంద్రంలోడాక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, ఎంపిహెచ్ రామకృష్ణ, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, చక్రాయిపేట సిహెచ్‌ఒ వెంకట్రామిరెడ్డి, సిబ్బంది, హెల్త్ మేల్ అసిస్టెంట్ వెంగయ్య పాల్గొన్నారు.

**డాక్యుమెంట్స్ పోయినవి**

నా పేరు పి. శ్రీనివాసుల రెడ్డి, మా తండ్రి గారి పేరు పి.నడిపి సుబ్బి రెడ్డి, నేను ఎర్రగుంట్ల నుండి ప్రొద్దుటూరుకి ఆటోలో వెళ్తుంటే నా ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పొయ్యాయి. ఎవరికైనా దొరికితే ఈ మొబైల్ ఫోన్‌ని సంప్రదించి నా ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఇవ్వవలసినదిగా కోరుచున్నాను.

సెల్ నంబరు: 8877220876
డాక్యుమెంట్ నంబరు: 993
రిజిస్ట్రేషన్ సంవత్సరం: 2020

**డాక్యుమెంట్స్ పోయినవి**

నా కక్షిదారురాలు, చిన్నబోయిన వెంకటేశ్వరి, భర్త: సి. రెడ్డియ్య, కానపల్లె గ్రామం, ప్రొద్దుటూరు మండలం, గారు నగరి శంకర్ రెడ్డి గారి నుండి సర్వే నెం. 392 లో య.0.05 సెంట్లు జాగాను కొనుగోలు చేసి ప్రొద్దుటూరు సబ్ రిజిష్టర్ వారి కార్యాలయము నందు రిజిష్టర్ చేయించియున్నారు. సదరు డాక్యుమెంట్ నెం. 3051/2023, తేది: 07.03.2024. దీనికి సంబంధించి లింక్ డాక్యుమెంట్ నెం. 2645/1984 గల డాక్యుమెంట్ బస్టాప్లో పోయినది. పైన తెలిపిన ఆస్తిని తాకట్టు పెట్టుకొని నా కక్షిదారుదారులు Ugro Capital వారి నుండి మార్టిగేజ్ లోన్ తీసుకుంటున్నారు. దీనికి సంబంధించి ఏవరికైనను చట్టపరమైన అభ్యంతరములు ఉన్నయెడల అట్టి అభ్యంతరములను 3 రోజులలోపు నాకు తెలియజేయగలరు.

**ఎ.సుదర్శన, బి.ఎ., బి.ఎల్.,**
అడ్వకేట్ & నోటరి
డోర్ నెం. 2/150బి, ఈశ్వర్ రెడ్డి నగర్
ప్రొద్దుటూరు-516360

**మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**O.S.NO: 177/2019**

షేక్ రవూఫ్ బాషా ...వాది
వర్సస్
వల్లేపు శివరామ కృష్ణ ...ప్రతివాది
టు,
ప్రతివాది చిరునామా:
వల్లేపు శివరామ కృష్ణ, తండ్రి వెంకట సుబ్బయ్య, వయస్సు 33 సంవత్సరాలు, ప్రైవేట్ ఉద్యోగి, హిందూ, కడప టౌన్, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 12వ తేదీ సెప్టెంబర్ నెల 2024 సంవత్సరంలో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 05-08-2024

ఇట్లు
శ్రీ షేక్ యాసిన్ బాషా,
వాది తరుపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9346513649

**IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT : PRODDATUR**
**E.P.No.23/2022**
**O.S.No.489/2018**

Koratala Venkata Subba Reddy, Son of Subba Reddy, Hindu, aged 70 years, Cultivation, resident of Door No.8/33, Kothapeta Village, Proddatur Mandal, Kadapa District.
...D.Hr./Petitioner
Vs
Kambam Sudhakar Reddy, Son of K.Subba Reddy, Hindu, aged about 47 years, Cement Business, residing at Door No.3/223. YMR Colony, Proddatur Town, Kadapa District.
...J.Dr./Respondents

**ORDER 21 RULE 22 NOTICE**

పై నెంబరు E.P.No.23/2022 ని పిటిషనర్/D.Hr. EP Schedule దాఖలు ఆస్తులను వేలం వేయకోరి రెస్పాండెంటు J.Dr. అయిన నీపైన దాఖలు చేసి ఉన్నారు. అయితే డిక్రీ కాలము '2' సం॥ పూర్తి అయిన పిదప J.Dr. అయిన నీకు రాజశ్రీ కోర్టు వారు డిక్రీ విషయం తెలుపు కోరుచు Notice Order చేసి ఉన్నారు. అట్టి E.P.No.23/2022 నందు J.Dr. అయిన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల 15/10/2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు స్వయంగా కాని లాయరు ద్వారా కాని హాజరు అయ్యి ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమున ఎక్సుపార్టీగా తీర్మానించబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**వాయిదా తేది: 15/10/2024**
**//By Order the Court//**
**MOPPE CHANDRA SEKHAR REDDY, B.Com.,B.L.,**
**Advocate For D.Hr.**